# సర్వజ్ఞుడు

మూలం : మామ్

అనువాదం : అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి

మాక్స్ కెలడా గారిని గురించి నాకు ఏమీ తెలియక ముందు నుంచే అతడంటే ఏదో అయిష్టం ఏర్పడింది. యుద్ధం అప్పుడే ఆరంభమైంది. ఒడల్లో ప్రయాణీకుల రద్దీ ఎక్కువగా ఉంది. చోటు దొరకడమే గగనంగా ఉంది. ఏజెంట్లు చూపించినవసతితోనే సరిపెట్టుకోవలసి వచ్చింది. పూర్తిగా నాకొక్కడికే ఒక కాబిన్ కావాలంటే దొరికే పనికాదు. అదృష్టం కొద్దీ నాకు మాత్రం రెండు బెర్తులున్న కాబిన్‌లో వసతి లభించింది. కాని ఆ కాబిన్‌లో నాతో పాటు ఉండే రెండో ప్రయాణీకుని పేరు వినేటప్పటికి నా గుండె జారిపోయింది. ఒడ పార్శ్వరంధ్రాలు మూసి, రాత్రిళ్ళు వీచే చల్లని సముద్రపుగాలిని స్తంభింపజేసిన ట్లుంది. ఎవరితోనైనా పద్నాలుగు రోజులు ఒకే కాబిన్‌లో కలిసి ఉండడమంటే మాటలుకాదు. (నేను శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి యోకహోమా వెళ్తున్నాను). నాతోటి ప్రయాణీకుని పేరు ఏస్మిత్తో, బ్రౌనో అయివుంటే అంత బాధవేసి ఉండకపోను. నేను ఒడలో ప్రవేశించే సరికే కెలడాగారి మూటాముల్లె అక్కడ క్రింద పరిచి ఉంది. దానిని చూడాలంటేనే నాకు ఏదోగా ఉంది.



ఆయన పెట్టెలకు ఎన్నో లేబిల్స్ అంటించి ఉన్నాయి. వార్డ్‌రోబ్ ట్రంకు చాల పెద్దదిగా ఉంది. టాయిలెట్ సామానులు పరిచి ఉన్నాయి. ఆయన 'మాన్యూర్ కోటీ' పోషకుడులా కనిపించారు. ఎందుకంటె వాష్‌స్టాండ్‌మీద అత్తరు, షాంపూ, బ్రిలియంటైన్‌లు చూస్తే అర్థమై పోయింది. ఆయన బ్రష్‌లూ, బంగారు అక్షరాలతో అతని పేరు చెక్కఉన్న నల్లచెక్క ముక్క --వీటన్నింటిని చూస్తే అదంతా ఒక కీకారణ్యంలా ఉంది. అసలు కెలడాగారంటే నాకిష్టమే లేదు. సిగరెట్ కాల్చుకోవడానికి పొగతాగే గదికి అప్పుడు నేను వెళ్ళాను పేక తీసుకొని పేషన్స్ ఆడడం ప్రారంభించాను. నేను అలా ఆట మొదలు పెట్టానో లేదో నాదగ్గర క్కొక వ్యక్తి వచ్చాడు. మీ పేరు ఫలాన అనుకొంటాను, అన్నాడు.

"నేను కెలడా గారిని," తళతళ మెరిసే పళ్ళు కనిపించేట్టు చిరునవ్వు నవ్వి, కూర్చొన్నాడు.

'ఓ, మన ఇద్దరిదీ ఒకే కాబిన్ అనుకొంటాను,'

'దానిని నేను అదృష్టం అంటాను. ఎవరు ఎవరితో ఉండబోతున్నారనేది ఎవరికీ తెలియదు. మీరు ఇంగ్లీషు వారని వినేసరికి నాకు ఎంతో సంతోషం వేసింది. ఇంగ్లీషు వాళ్ళంటే నాకు చాల ఇష్టం. విదేశాలకు వెళ్ళినప్పుడు కలిసి మెలిసి ఉండవచ్చు. నేను చెప్పింది మీకు అర్థం అయిందనుకొంటాను?'

నేను దానిని పట్టించుకోలేదు.

'మీరు ఆంగ్లేయులా?' బహుశా ఔచిత్యరహితంగా అడిగా.

'అవును, నన్ను కొంపతీసి, అమెరికన్ అనుకొంటున్నారా? నేను నిలువెల్లా, ముమ్మూర్తులా ఇంగ్లీషు వాణ్ణి.'

దానిని రుజువుచేయుడానికి కెలడాగారు తన జేబులోంచి పాస్‌పోర్టు కాగితం తీసి, దానిని నా ముఖం దగ్గర అటుఇటు ఊపాడు.

జార్జిరాజు పాలనలో అనేక రకాల గమ్మత్తైన ప్రజలున్నారు. కెలడాగారు పొట్టి, బలిష్ఠమైన శరీరం. నున్నగా గడ్డంగీచుకొన్నాడు. రంగు నలుపు. వంకర దిరిగిన ముక్కు. మెరిసే విశాలమైన కన్నులు. నల్లని పొడవైన జుట్టు గిరజాలు తిరిగి ఉంది. ఆయన అనర్గళంగా మాట్లాడతారు కాని, అందులో ఇంగ్లీషు అనదగింది ఏమీ ఉండదు చేతులు తిప్పకొంటూ, మంచి ఉత్సాహంగా, ఉల్లాసంగా కనిపిస్తాడు. నేను గనుక ఆ బ్రిటీషు పాస్ పోర్టును సరిగా చూసినట్లైతే, మామూలు ఇంగ్లాండ్ ప్రజలకంటె చేవలేని వర్గం నుంచి వచ్చాడని తప్పకుండా అనుకొని ఉండేవాణ్ణి.

'మీరేమి తీసుకొంటారు?' ఆయన నన్నడిగారు.

సందేహంగా అతని వంక చూశాను. మద్యపాన నిషేధం అమలులోఉంది. ఓడలో ఎక్కడా ఒక్క చుక్క మద్యం కూడా ఉన్నట్లులేదు. నాకు తాగాలనిపించినప్పుడు --జింజర్‌యేల్, నిమ్మరసపానీయం --ఏది ఎక్కువ అయిష్టమో చెప్పలేను. అప్పుడు తూర్పుదేశాలవాళ్ళు నవ్వే పద్ధతిలో నా వైపు ఒక చిరునవ్వు విసిరాడు.

'విస్కీ -సోడా తీసుకొంటారా? లేదంటే వీట్ మార్టినీ తీసుకొంటారా? చెప్పడమే మీవంతు.'

ఆయన తనలాగు వెనక జేబులోంచి ఒక ఫ్లాస్కు తీసి, దానిని బల్లమీద నాఎదురుగా ఉంచాడు. నేను మార్టినీ కావాలన్నాను. స్ట్యూవార్డ్‌ని పిలిచి, రెండుగ్లాసులు, ఐస్ పట్టుకు రమ్మన్నాడు.

'చాలా బాగుంది కాక్‌టెయిల్', అన్నాను.

'మంచిది. అవెక్కడనుంచి వచ్చాయో మీకనవసరం. కావాలంటే ఇంకా కావలసినన్ని ఉన్నాయి. మీకు గనుక ఈ ఓడలో మిత్రులెవరైన ఉంటే, అడిగినంత మద్యాన్ని ఇవ్వగల మిత్రుడు మీకొకరు ఉన్నారని వారితో చెప్పండి.'

కెలడాగారు మంచి కబుర్ల రాయుడు. అతడు న్యూయార్క్ గురించి మాట్లాడాడు, శాన్‌ఫ్రాన్సిస్కో గురించి మాటాడాడు. నాటకాలు సినిమాలు, రాజకీయాలు ఒకటేమిటి దేనిని గురించి అయినా మాటాడాడు. ఆయన దేశభక్తుడు. బ్రిటీషు పతాకం చాల అందంగా ఉంటుంది. కాని అటువంటి జెండాను ఏ అలెగ్జాండ్రియానుంచో, బీరూట్ నుంచో వచ్చిన పెద్దమనిషి ఊపితే, దాని గౌరవం పడిపోతుంది. కెలడాగారితో నాకు పరిచయం ఉంది. నేనేదో గొప్పవాడినని కాదుగాని, నాకు పరిచయంలేని వారు నన్ను సంబోధించేటప్పుడు నా పేరు ముందు 'శ్రీ' తగిలించడం మర్యాదనుకొంటాను. కాని కెలడాగారు నన్ను అటువంటి డొలాయమాన స్థితిలో పడవేయకుండా, నా పేరు ముందు 'శ్రీ' వాడలేదు. నాకు కెలడా గారంటే ఇష్టంలేదు. ఆయన కూర్చోగానే నేను పేకముక్కలను అవతల పడవేశాను మాటల్లో పడి చాల సేపయిందని అప్పుడుగాని గుర్తించలేకపోయాను. మళ్ళీ పేకాట ప్రారంభించాను.

'నాలుగుమీద మూడు,' కెలడాగారన్నారు.

పేషన్స్ ఆడేటప్పుడు, నీవు తిప్పిన ముక్కను నీవుచూసేలోపలే దానిని ఎక్కడ ఉంచాలో చెప్పించుకోవడమంత చికాకు మరొకటి ఉండదు.

"అదిగో అదే. అది వస్తోంది. జాకీ మీద పది," ఆయన అరిచారు.

అసహ్యంతో, జుగుప్సతో, నాకడుపులో దేవినట్లై ఆటఅయిందనిపించాను. అప్పుడాయన పేకను తీసుకొన్నారు.

'మీకు పేకట్రిక్కులంటే ఇష్టమేనా?'

'వహూ! కార్డు గమ్మత్తులంటే నాకసహ్యం! నేను సమధానంచెప్పా. అయితే ఈ ఒక్క ట్రిక్కు చూడండి.'

నాకు మూడు ట్రిక్కులు చూపించాడు. నేను భోజనశాలకు వెళ్ళి సీటు చూసుకు వస్తాను అన్నాను.

'మీరంది బాగానే ఉంది. కాని, మీకు సీటు ఎప్పుడో చూసి పెట్టాను. మనం ఒకే గదిలో ఉంటున్నాం కాబట్టి ఒకే టేబుల్ వద్ద భోంచేస్తే బాగుంటుంది. అందుకని అలా చేశాను.

కెలడాగారంటే నా కిష్టంలేదు.

అతనితో అదే గదిలో ఉండడమే కాదు, ముప్పూట అతనితో ఒకే బల్ల వద్ద భోంచేయుడమేకాదు, ఆయన ప్రక్కనలేకుండా అలాడెక్‌మీదకు వెళ్ళి ఒకసారి గాలి పీల్చుకు రావడానికి గూడ వీలు లేకుండా పోయింది. అతన్ని ఉపేక్షించడం అసంభవమై పోయింది. తన సాంగత్యాన్నెవరూ కావాలనుకోవడం లేదనేది అతనికెప్పుడూ తట్టదు. ఆయన నిన్ను చూసినప్పుడు ఆయనకెంత సంతోషం కలుగుతుందో, ఆయన్ను నీవు చూసినప్పుడూ నీవు అంతగా సంతోషిస్తావని ఆయన విశ్వాసం. అదే నీయింట్లో అయితే, మెట్లమీదినుంచి పడేట్టు ఒక్క తన్ను ఈడ్చి తన్ని, ఆయన ముఖాన తలుపు పెడేలున మూసి వేయవచ్చు, తాను అవాంఛనీయ వ్యక్తి అని ఆయనకు అనుమానం రాకముందే. ఆయన మంచి కలుపుగోలు మనిషి. మూడు రోజుల్లో ఓడలో వారందరితో పరిచయం చేసుకొన్నాడు. అక్కడ ప్రతిదీ ఆయనే నడు

పుతాడు. అంతా ఆయన చేతుల మీదుగానే జరుగుతుంది. శుభ్రం చేయించడం దగ్గర నుంచీ, వేలం పాటలు పెట్టించే దగ్గరనుంచీ, ఆటలకు కావలసిన బహుమతులకు డబ్బు పోగుచేసే దగ్గరనుంచి, రింగు, గోల్ఫు ఆటల పోటీలను నిర్వహించేదగ్గర నుంచీ, విచిత్ర వేషధారణ పోటీల వరకూ అన్నీ ఆయనే నిర్వహిస్తాడు ఎక్కడా ఆయనే, అన్నిటా ఆయనే. అందుకని ఓడలో అందరూ ఆయన్ను అసహ్యించుకొంటారు భరించలేక. అంతేకాదు, ఆయన్ను ఆయన ముఖం మీదే 'సర్వజ్ఞుడు గారూ!' అని సంబోధిస్తారు. దానిని ఆయన పొగడ్త అనుకొంటారు. భోజనసమయంలోమాత్రం ఆయన్ను అసలు భరించలేం. ఆ కాసేపట్లో గూడ ఆయన మా మీద దయతలవాల్సిందే తప్ప, మేము చేయగలిగింది ఏమీలేదు. ఆయన మాత్రం హృదయ పూర్వకంగా, హేతుబద్ధంగా, నవ్వుతూ, పేలుతూ, ధారాళంగా మాట్లాడతారు. ఏ విషయం మీదనైన ఏ ఒక్కడికంటే ఆయనకు బాగా తెలుసు ఆయనతో విభేదించడం అంటే, అత్యంత ఆత్మవిశ్వాసంతో గూడిన ఆయన గర్వాన్ని అవమానించడమే అవుతుంది. ఎంత పనికిమాలిన విషయాన్నైనా ఆయన వదిలిపెట్టరు. ఆయన్ను ఎవరైన అపార్థం చేసుకోగలరనేది ఆయన ఊహకందని విషయం ఆయన అన్నీ తెలిసిన మనిషి. డాక్టరు బల్లచుట్టూ మేమంతా చేరాం. డాక్టరు కొంచెం బద్ధకస్తుడు. నేను మూతి బిగించుకు కూర్చొన్నాను. రామ్‌సే గూడ అక్కడే ఆసీనుడై ఉన్నాడు. లేకపోతే కెలడాగారు తమ మామూలు పద్ధతిలో కానిచ్చేవాడే. రామ్‌సే గూడ కెలడాగారంత ఛాందస్తుడే. అందుకే వారిద్దరి మధ్య చర్చలు చేదుగాను, అనంతంగాను సాగుతాయి.

రామ్‌సే అమెరికన్ కాన్సలర్ సర్వీసులో పనిచేస్తున్నాడు. అతని ఉద్యోగం కోబెలో. అతడిది భారీకాయం. మధ్య పాశ్చాత్యం నుంచి వచ్చాడు. అతడి బిగుతైన చర్మం క్రింద వార్లు ఉబ్బు కొస్తున్నాయి. రడీమేడ్ దుస్తుల్లోంచి బయటికి పొడుచుకొస్తోంది అతని శరీరం. ఇంటి దగ్గర ఒక ఏడాది పాటుగా ఉంటున్న తన భార్యను తీసుకురావడానికని న్యూయార్క్ వెళ్ళి, తిరిగి వస్తున్నాడు. రామ్‌సేభార్య చాల అందగత్తె. హాస్యప్రియ. మర్యాద మన్ననలు ఎరిగిన స్త్రీ. - కాన్సలర్ సర్వీసులో అతనికి జీత భత్యాలు పెద్దగా రావు. అందుకని ఆమె ఎప్పుడూ సాదా సీదా దుస్తులనే ధరిస్తుంది. కాని ఏ బట్ట ఎలా వేసుకోవాలో ఆమెకు తెలిసినంతగా మరొకరికి తెలియదు. ఆమెకు ఏదోతనదైన ఒక ప్రత్యేకత ఉంది. అసలు ఆమె వైపు నాదృష్టిసారించి ఉండక పోదును. ఆమెలో ఒక గుణం ఉంది. అది అందరి ఆడవాళ్ళకు సహజంగా ఉండేదే ఆయినా, ఈ రోజుల్లో అది వారిప్రవర్తనలో నామమాత్రంగానే కనిపిస్తోంది. ఆమెలో సాదాతనం, మర్యాదపూర్వక ప్రవర్తన, ఒబ్బిడితనం కొట్టవచ్చినట్లు కనిపిస్తాయి. ఈ ప్రత్యేకత ఆమెలో, కోటుబొత్తాంలో పూవులా మెరుస్తోంది.

ఒకనాటి సాయంత్రం అనుకోకుండ సంభాషణ ముత్యాల మీదకి మళ్ళింది. జపాన్ వాళ్ళు నకిలీ ముత్యాలు తయారు చేసి అసలు ముత్యాల క్రింద ప్రజలను మోసగిస్తున్నారనే వార్త పేపర్లో పడింది. అసలు ముత్యాలు విలువను అవి తప్పకుండా దెబ్బతీస్తాయని డాక్టరన్నాడు. ఆ ముత్యాలను ఇప్పటికే వారు బాగా నిపుణతతో చేస్తున్నారు. కొద్దికాలంలో అవి అసలు ముత్యాలతో తులదూగుతాయి. కెలడాగారు, తమ అలవాటు ప్రకారం, ఈ చర్చలోకి జొరబడ్డారు. ముత్యాలగురించి తెలుసుకోవలసినదంతా ఆయన మాకు వివరించారు. వాటిని గురించి రామ్‌సేకు ఏమీ తెలియదనే నా అనుమానం కాని కెలడాగారిమీద దాడిచేయడానికి వచ్చిన ఈ అవకాశాన్ని అతడు జారవిడువదలచుకోలేదు. ఐదునిముషాలు గడిచేటప్పటికి చర్చవేడెక్కింది. కెలడాగారు వేడిగాను, వాక్చాతుర్యంతోను మాట్లాడాడు. కాని ఆయన ఇప్పుడు మాట్లాడుతున్నంత వేడిగా తీవ్రంగా మాట్లాడడం నేను ఎప్పుడూ చూడలేదు. చివరకు రామ్‌సే మాట్లాడింది ఆయనకు ఎక్కడో తగిలింది. లేకపోతే అతడు అంత పెద్దగా బల్లగుద్ది అరవడు.

'నేను మాట్లాడేది నాకు తెలిసే మాటాడుతున్నాను. నేను అసలు ఇప్పుడు జపాన్ వాళ్ళు చేసే ఈ ముత్యాల వ్యాపారం సంగతి చూడడానికే వెళ్తున్నాను. నేను చేసేది ముత్యాల వ్యాపారమే. నేను ముత్యాల గురించి ఏమి చెప్పినా అది సరైనదేనని ఈ వ్యాపారంలో ఉన్న ప్రతిఒక్కడూ ఒప్పుకొంటాడు. ఈ ప్రపంచంలో ఉన్న అత్యంత మంచి ముత్యాలన్నింటిని గురించి నాకు క్షుణ్ణంగా తెలుసు. ముత్యాలగురించి నాకు తెలియంది ఏదైనా ఉంటే అది అసలు తెలుసుకోదగిందే కాదన్నమాట.'

ఇది మాకు వార్త. కెలడాగారు ఎంత ఎక్కువగా మాటాడినా, ఆయనెప్పుడూ తానేమి చేసేది ఎవరికీ తెలియనీయలేదు. ఏదో వ్యాపారం పనిమీద ఆయన జపాన్ వెళ్తున్నాడని లీలా మాత్రంగానే మాకు తెలుసు. ఒకసారి విజయగర్వంతో చుట్టూ కలయచూశాడు.

'నాలాంటి నిపుణుడు, అలాచూసీ చూడక ముందే అదినకిలీముత్యమో కాదో కనుక్కో లేనంత బాగా వాళ్లు ఎప్పటికీ తయారు చేయలేరు.' రామ్‌సే భార్య మెడలో ఉన్న హారం వైపు చూడమన్నారాయన. "మీరు నా మాట విశ్వసించండి. శ్రీమతి రామ్‌సేగారూ! మీ మెడలో ఉన్న ముత్యాల హారం విలువ ఇప్పుడున్న దానికన్న ఎప్పుడూ పడిపోదు."

శ్రీమతి రామ్‌సే కొద్దిగా సిగ్గుపడి, తన హారాన్ని దుస్తుల చాటుకు సర్దింది. రామ్‌సే ముందుకు వంగాడు. మా అందరివంక చూశాడు. అతడి కళ్ళల్లో చిరునవ్వు దోబూచులాడుతూ

'శ్రీమతి రామ్‌సే హారం చాలా అందంగా ఉంది, అవునుకదూ?'

'నేను ఆ గొలుసును మొదట చూసినప్పుడే అనుకొన్నాను అవి అసలైన ముత్యాలని.' కెలడా గారన్నారు.

'దానిని నేను కొనిపెట్టలేదనుకోండి. మీ ఉద్దేశంలో అది ఎంత విలువ చేస్తుందో తెలుకుకోవాలని ఉంది.'

'ఓ, దాని మార్కెట్ విలువ పదిహేను వేల డాలర్ల వరకు పలుకుతుంది. కాని దాన్ని ఫిఫ్త్ అవెన్యూలో కొని ఉంటే దాని

> 'నాలాంటి నిపుణుడు, అలా చూసీ చూడక ముందే అది నకిలీముత్యమో కాదో కనుక్కోలేనంత బాగా వాళ్ళు ఎప్పటికీ తయారు చేయలేరు.'

ముప్ఫైవేల డాలరైనా చెల్లించి ఉండాలి.'

రామ్‌సే వెలాతెలా పోతూ నవ్వాడు.

'మేము న్యూయార్క్ నుంచి బయలుదేరేదానికి ఒకరోజుముందు అక్కడ డిపార్ట్‌మెంటల్ స్టోర్‌లో పద్దెనిమిది డాలర్లకు కొన్నమంటే మీరు నమ్మరు.'

కెలడాగారి ముఖం ఎర్రబడింది.

అవి అసలైన ముత్యాలు. అంతేకాదు దాని గొలుసు కూడా సైజుకు బాగా అమిరింది. నేను చూసిన వాటిలోకెల్లా ఇది చాలాబాగుంది.

"పందెం కడతారా?" అది నకిలీదండి అని నేను వందడాలర్లు కాస్తాను.

'ఆ, ఒప్పుకొంటున్నా'

'ఓ, అంత కచ్చితంగా తెలిసిన విషయం మీద మీరు ఎలా పందెంకాస్తారు?' అంది శ్రీమతి రామ్‌సే.

ఆమె పెదాల మీద చిరునవ్వు జారిపోయింది. గొంతుకూడ నెమ్మదిగా పూడుకు పోయింది.

'పందెంకాయులేనంటారా? ఆవిధంగా తేలికగా డబ్బువచ్చే మార్గముంటే, బుద్ధి ఉన్న వాడెవడూ అలాంటిదండను కొనకుండా ఉండడు.'

'కాని దానిని రుజువు చేయడం ఎలా? కెలడాగారికి వ్యతిరేకంగా నేను చెప్పిన దానిని అంగీకరించవలసిందేకదా? ఆమె అంది.'

'ఏది, ఆ గొలుసును ఒక్కసారి నన్ను చూడనివ్వండి. అది గనుక నకిలీదైతే నేను వెంటనే చెప్పేస్తాను. ఒక వందడాలర్లు పోయినా నాకేం పరవాలేదు,' కెలడాగారన్నారు.

'దానిని తీసి ఇవ్వు ప్రియా. ఆ పెద్దమనిషిని కావలసినంత సేపు చూడనీ.'

శ్రీమతి రామ్‌సే తటపటాయించింది. ఆమె తన చేతులతో గొలుసు కొక్కేన్ని తప్పించ ప్రయత్నించింది.

'అది నాకు ఊడిరావడంలేదు. నేను చెప్పిన విలువను కెలడాగారు అంగీకరిస్తే చాలు,' ఆమె చెప్పింది.

ఏదో అనర్థం జరగబోతోందని నాకనిపించింది. కాని అదేమిటో, ఎలా చెప్పాలో తెలియలేదు.

రామ్‌సే ఎగిరిదూకి, 'దానిని నేను తీస్తాను,' అన్నాడు.

అతడు ఆ గొలుసును కెలడాగారికిచ్చాడు. ఆయన తన జేబులోంచి ఒక భూతద్దం తీసి, దానిని నిశితంగా పరిశీలించాడు. విజయగర్వంతో గూడిన దరహాసం ఆయన మృదువైన నల్లని ముఖంపై పులుముకొంది. ఆ గొలుసు తిప్పి ఆమెకిచ్చివేశాడు. ఆయన చెప్పడానికి ఉద్యుక్తుడయ్యాడు. అనుకోకుండా శ్రీమతి రామ్‌సే ముఖంలోకి చూశాడు. ఆమె ముఖం తెల్లగా పాలిపోయింది. స్పృహ కోల్పోతున్నట్లు కనిపించింది. భయాందోళనతో ఆయన ముఖం వంక తదేకంగా చూడసాగింది. నిస్పృహతో గూడిన ఏదో అభ్యర్థన కళ్ళల్లో కనిపించింది. అది చాలా స్పష్టంగా కనిపించింది. మరి ఆ భర్త దానిని ఎందుకు గమనించలేకపోయాడో నాకు ఆశ్చర్యం వేసింది.

కెలడాగారి తెరచిన నోరు తెరిచినట్లే ఉండిపోయింది. ఆయన ముఖం ఎర్రబడింది. ఆయన తనను తాను నిగ్రహించుకోవడానికి చేస్తున్న ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తోంది.

'నేనే పొరపాటు పడ్డాను. ఇది మంచి అనుకరణ ముత్యాలదండ. నేను భూతద్దం క్రింద చూసినప్పుడే అవి అసలు ముత్యాలు కావని గ్రహించాను. నకిలీ ముత్యాలు ఎంత చేస్తాయో ఈ దండ విలువ అంతే -- అదే పద్దెనిమిది డాలర్లు.'

తన జేబులోంచి చిన్న నోట్‌బుక్ తీసి, అందులోంచి వందడాలర్ల నోటును లాగి, మారుమాటలేకుండా రామ్‌సేకు ఇచ్చాడు.

'మరోసారి ఎప్పుడూ మరీ అంత గట్టి నమ్మకంతో మాటాడడం మంచిది కాదని ఈ సంఘటన బహుశ మీకు పాఠం చెప్తుందనుకొంటాను, నా బుల్లి మిత్రుడా,' ఆ నోటునందుకొంటూ రామ్‌సే అన్నాడు.

కెలడా గారిచేతులు వణకడం నాకు కనిపించింది.

మామూలుగా కథలు ఆనోటా ఆనోటా పడి ఎలా వ్యాపిస్తాయో ఈ సంఘటన ఓడ అంతటా అలాగే తెలిసిపోయింది. ఆ సాయంత్రం ఆయన్ను పట్టుకొని అందరూ ఏడ్పించారు. దాన్ని ఆయన దిగమింగవలసి వచ్చింది. 'అన్నీ తెలిసిన సర్వజ్ఞుడుగారు పప్పులో కాలువేశారు.' ఇది పెద్ద జోక్ అయిపోయింది. కాని శ్రీమతి రామ్‌సే, తలనొప్పిగా ఉందని చెప్పి, తన గదికి వెళ్ళిపోయింది.

మరుసటి రోజు ఉదయం నిద్రలేచి గడ్డంగీచుకోవడం మొదలుపెట్టాను. కెలడాగారు సిగరెట్టు కాలుస్తూ మంచంమీదనే పడుకొని ఉన్నారు. ఆకస్మికంగాఏదో బరబర శబ్దం వినవచ్చింది. ఆ వైపుకు చూశాను. తలుపుక్రింది నుంచి ఒక ఉత్తరం లోపలికి వచ్చిపడింది. తలుపు తెరచి బయటకు తొంగి చూశాను. అక్కడ ఎవరూ కనిపించలేదు. ఆ ఉత్తరం తీసి చూశాను. అది కెలడాగారికి రాసిన ఉత్తరం. దాని మీద పేరు విడివిడిగా పెద్ద పెద్ద అక్షరాలతో రాసి ఉంది. ఆయనకు ఆ ఉత్తరాన్ని అందించాను.

'ఇది ఎవరి నుంచి?' దానిని తెరిచాడు 'ఓహ్!' అయన ఎన్వలోప్‌లోంచి బయటికి తీసింది ఉత్తరాన్ని కాదు, వంద డాలర్ల నోటును. నా వంక చూశాడు. ముఖం ఎర్రబడింది ఎన్వలూప్‌ను ముక్కముక్కలుగా చించి, ఆ ముక్కలను నాచేతికిచ్చారు.

'మీరు ఏమీ అనుకోకపోతే ఆ ముక్కల్ని ఓడ పార్శ్వరంధ్రం లోంచి బయటికి విసరివేయండి.'

ఆయన చెప్పినట్లే చేశాను. అప్పుడాయన వంక చిరునవ్వుతో చూశాను.

'శుద్ధ, వెర్రి వెంగళప్పలా చూడబడడం ఎవరికీ ఇష్టం ఉండదు,' ఆయన అన్నారు.

'ఆ ముత్యాలు అసలైనవేనా?'

'నాకు గనుక అంత అందమైన భార్య ఉంటే ఏడాదిపాటు ఆమెను న్యూయార్కులో వదిలిపెట్టి, ఎక్కడో కోచ్‌లో ఉండిపోను,' ఆయన అన్నారు.

ఆ సమయంలో కెలడాగారంటే నాకు పూర్తి అయిష్టత కలగలేదు. తన జేబులోంచి పుస్తకంతీసి, జాగ్రత్తగా వంద డాలర్లనోటును అందులో పెట్టుకొన్నాడు. *



"నిన్ను పిచ్చికుక్క కరిచిందటగా కాలుకున్న కట్టు అదేనా! అప్పుడే వీలునామా వ్రాస్తున్నావా! నీ కంగారు బంగారంగానూ!" -- సుబ్బారావు వస్తూనే సుందరయ్యను పలకరించిన తీరు అది.

సుందరయ్యేం తక్కువ తినలేదు. వెంటనే ఇలా అన్నాడు- "ఇది వీలునామా కాదు సన్నాసీ! రేపు నాకు పిచ్చి ఎక్కిన తరువాత ఎవరెవర్ని కరవాలో ఓ లిస్టు రాసుకుంటున్నా! మొదట నీ పేరే రాశాను."

- మేడిశెట్టి